# సింగిల్ పేజీ కథలు

## మోసం

**"బావా నన్ను ఆ కొత్త సినిమాకు తీసుకొనిపోవాల్సిందే. రేపటితో సెలవులు అయిపోతాయి. మళ్ళీ మావూరికి వెళ్ళిపోవాలి" మారం చేశాడు శరత్.**

**"ఒరేయి అది నిన్ననే రిలీజ్ అయింది. టిక్కెట్లు దొరకటం కష్టంరా" వారించాను.**

"ఏమో నాకది తెలీదు. నేను వూరికెళ్ళి ఆ సినిమా చూశానని మా ఫ్రెండ్స్ అందరికీ గొప్పగా చెప్పుకోవాలి" పంతం పట్టాడు శరత్.

"ముచ్చట పడుతున్నాడు తీసుకొని వెళదాం" అంది నా భార్య వసుమతి.

"సరే సాయంత్రం ఆఫీసునుండి రాగానే వెళదాం" చెప్పేసి ఆఫీసుకు వెళ్ళిపోయాను.

★ ★ ★

"చూశారా ఎంత జనం ఉన్నారో! మనకు టిక్కెట్లు ఎలా దొరుకుతాయి?" ప్రశ్నించాను శరత్‌ను.

"బ్లాక్‌లోకొంటే అవే దొరుకుతాయి" స్టైల్‌గా అన్నాడు శరత్.

"వేలెడంత లేడు. ఎన్ని తెలివితేటలు. అచ్చం నీలాగే" అన్నాను వసుమతితో.

"చాల్లేగానీ మీ మాటలు, వెళ్ళి బ్లాక్ టిక్కెట్ల కోసం ప్రయత్నించండి" అంది వసుమతి.

ఇంతలో అటుగా బ్లాక్ టిక్కెట్లు అమ్మేవాడు రావటంతో

"ఎంతా?" అని ప్రశ్నించాను.

"వంద" అన్నాడు అతడు.

"అదేంటి 50 రూపాయల టిక్కెట్టు వంద రూపాయలా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవతల 150 ఇచ్చేవాళ్ళు ఉన్నారు కావాలా? వద్దా?" మళ్ళీ అడిగాడు.

"మాకేం వద్దులే" చెప్పేశాను.

"అదేంటండీ తీసుకొంటే పోయేదిగా?" అడిగింది వసుమతి.

"కాసేపు ఆగితే ఏ 70 రూపాయలకో వాడే ఇస్తాడు" అన్నాను.

ఇంతలో సార్ అన్న పిలుపు విని వెనక్కి తిరిగి చూశాను.

ఎవరో పరిచయం లేని వ్యక్తి. ఏమిటి అన్నట్లు చూశాను.

"సార్ మా ఫ్రెండ్స్ సినిమాకు వస్తారని మూడు టిక్కెట్లు కొన్నాను. తీరా వాళ్ళు రావటం లేదని ఫోన్ చేశారు. వాళ్ళు లేకుండా నేను కూడా సినిమా చూడలేను. మీరు టిక్కెట్ల కోసమని ప్రయత్నిస్తున్నట్లుగా వుంది. మీకు అభ్యంతరం లేకపోతే నాటిక్కెట్లను తీసుకోండి. వేరెవరికైనా ఇస్తే బ్లాక్ టిక్కెట్లు అమ్మేవాడని అనుకొంటారని మొహమాట పడ్డాను సార్. అందుకే మీ కిస్తున్నాను" అన్నాడు అమాయకంగా.

"ఎంత?" అన్నాను.

"నేను బ్లాక్‌లో టిక్కెట్లు కొన్నాను. అయినా నాకు అసలు టిక్కెట్టు ధర ఇవ్వండి చాలు" అన్నాడు ఆ వ్యక్తి.

ఇదిగో తీసుకోండి అంటూ అతనికి రెండు వందలిచ్చాను.

"నూట యాభై ఇవ్వండి చాలు" అన్నాడు.

"ఫరవాలేదు వుంచండి" అన్నాను.

అతను టిక్కెట్లు ఇచ్చేసి వెళ్ళిపోయాడు.

"చూశావా! అతను ఎవడో జెంటిల్‌మెన్‌లా వున్నాడు. అందుకే అసలు ధరకి టిక్కెట్లు ఇచ్చాడు" అన్నాను టిక్కెట్లను జేబులో వుంచుకుంటూ.

ఇంతలో లోపలికి వెళుతున్న జనాన్ని చూసిన శరత్-

"రా బావా థియేటర్‌లోకి వెళదాం" అనటంతో ముగ్గురం బయలుదేరాము. నేనిచ్చిన టిక్కెట్లు తీసుకొన్న గేట్ కీపర్

"సార్ ఈ టిక్కెట్లు ప్రక్క థియేటర్‌వి... అక్కడికి వెళ్ళండి" అన్నాడు.

"ఏం తమాషాగా వుందా. ప్రక్క థియేటర్ కూలగొట్టి నెలరోజులవుతుంది తెలుసా?" అన్నాను కాస్తంత కోపంగా.

"అవును సార్ ఇవి నిజంగా ప్రక్క థియేటర్ టిక్కెట్లే కావలిస్తే చూడండి" అంటు టిక్కెట్లు చూపించాడు.

ఔను నిజంగా అవి కూలకొట్టిన ప్రక్క థియేటర్ సినిమా టిక్కెట్లే. వాడెవడో ఆ టిక్కెట్లు నాకు అమ్మాడు అనుకుంటూనే ఇంటిదారి పట్టాం.

"మీ జెంటిల్‌మాన్ నిన్ను బాగానే మోసం చేశాడు బావా" అన్నాడు శరత్ నడుచుకుంటూ.

**-ఎన్.వి.శ్రీధర్ శర్మ (పార్నపల్లి)**

## నిర్ణయం

**"ఈరోజు నా మనసంతా తెలియని ఆనందంతో నిండిపోయింది! దసరా పండక్కి రమ్మని ఫోన్ చేస్తే..ఇద్దరు కొడుకులూ వారి భార్యా పిల్లలతో నాల్రోజులు ముందుగానే వచ్చారని కాదు!**

నిన్నటివరకు సరదాలతో, సందళ్లతో..మనవడూ మనవరాళ్ల చిలక పలుకుల చిరుగజ్జెల సవ్వడితో ఇల్లంతా కళకళ లాడిందనీ కాదు! ఈ ఆనందానికి అంతరార్థం నా మనసుకి... నేను సరైన నిర్ణయమే తీసుకున్నానని గట్టిగా అన్పించడమే!

ఆరు పదుల జీవితంలో ఎన్నో అనుభవాలు, ఎన్నో గుణపాఠాలు చవి చూసాను. 'అనుబంధాలు' అనేవి మరుగున పడి వాటి స్థానంలో 'ధన బంధాలు' మెరుగు దిద్దుకున్నాయని గ్రహించాను.

"ఏదైనా కుటుంబమంటే రాఘవయ్యగారిదేరా. ప్రతి పండక్కీ కొడుకులిద్దరూ పిల్లా పాపలతో వస్తారు. మంచి చెడ్డలు మాట్లాడుకుంటారు. ఆయన పెంపకమే పెంపకం" అని ఊళ్లో జనాలు గొప్పగా చెప్పుకుంటున్నారంటే దానికి కారణం..వాళ్లని ప్రేమగా పెంచడం కాదు సుమా! వాత్సల్యం అనే మబ్బు నన్ను కమ్మేయకుండా జాగ్రత్తపడ్డాను.

అందరిలాగే నేనూ నా కొడుకుల్ని చూసి మురిసిపోయేవాడిని. అపురూపంగా పెంచడమే కాదు వారికి నచ్చిన ఉద్యోగ వ్యాపార రంగాల్లో బ్రతుకు తెరువు కల్పించాను. మంచి సంబంధాలు చూసి పెళ్లిళ్లు చేసాను.

ఓ రోజున ఇద్దరూ ఎంతో ఆప్యాయత కనబరుస్తూ నా వద్దకు వచ్చారు. "ఎందుకు నాన్నా ఒంటరిగా ఈ ఊళ్లో..మాతో వచ్చేయండి" అని పట్టుబట్టారు. కంటికి రెప్పలా చూసుకుంటామని భరోసా ఇచ్చారు.

ఆ మాటలకు నా చెవులలో తేనె పోస్తున్నట్లుగా అనిపించింది. చల్లగాలికి మంచు ముక్క కరిగిపోయినట్లు నీరైపోయాను. నాకూ వెళ్లిపోవాలనే అనిపించింది. ఈ వయసులో కష్టానికి, సుఖానికి వాళ్ల ఆసరా అవసరమనిపించింది. కానీ ఊరిలో వున్న నాలుగెకరాల పొలం సంగతేంటి? అని ఆలోచనలో పడ్డాను. ఎవరికైనా కౌలుకి ఇచ్చేద్దాంలే అనిపించింది. అదే